నమస్తే తెలంగాణ

సూర్యాపేట

5 | నల్లగొండ, ఆదివారం 28 జూలై 2024 | SURYAPET




హైకోర్టు న్యాయమూర్తులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు

## యాదగిరీశుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

యాదగిరిగుట్ట, జూలై 27 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారిని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ వి.వేణుగోపాల్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.వినోద్‌కుమార్, కె.లక్ష్మణ్, కె.సుజన, జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎ.జయరాజు దర్శించుకున్నారు. పట్టణంలో జూనియర్ సివిల్ కోర్టును ప్రారంభించేందుకు శనివారం వచ్చిన వారు స్వయంభూ పంచనారసింహస్వామి దర్శనం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు ఆలయ సంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. దర్శనానంతరం ముఖ మండపంలో వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈఓ భాస్కర్‌రావు న్యాయమూర్తులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి, ప్రసాదం అందజేశారు.

## పాఠశాలకు రాని ముగ్గురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

- మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు

సూర్యాపేట, జూలై 27 : అనుమతి లేకుండా పాఠశాలకు హాజరు కాని ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మరో ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు అందించారు. చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరి గ్రామంలో కలెక్టర్ శనివారం ఉదయం ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్.. ముందస్తు సమాచారం లేకుండా పాఠశాలకు రాని స్కూల్ అసిస్టెంట్ ఎం.నాగమణిని సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు పి.జానకి, ఆర్.వెంకటయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో గతంలో డీఈఓ అశోక్ తనిఖీ చేసిన సమయంలో అనుమతి లేకుండా పాఠశాలకు డుమ్మా కొట్టిన ఎస్జీటీ ఉపాధ్యాయులు పి.సత్యమూర్తి (నానుతండా) టి.వెంకటరాములు (బండరామారం)ను కూడా సస్పెండ్ చేశారు.

## ధరణి పెండింగ్ దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కరించాలి

- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ధరణి దరఖాస్తులపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, జూలై 27 : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కరించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లతో శనివారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణి సమస్యల పరిష్కారానికి వివిధ మాడ్యూల్స్‌లో దాఖలైన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను రెండు వారాల్లో పూర్తి చేయాలని, కోర్టు కేసులు, లోకాయుక్త కేసుల్లో ఉన్న వాటిపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వచ్చే దరఖాస్తుల పెండింగ్‌కు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధరణి దరఖాస్తులను పరిశీలించకుండా తిరస్కరించవద్దని, తిరస్కరణకు గల కారణాలను దరఖాస్తుదారుడికి తెలపాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ డివిజన్ల వారీగా సమీక్షించి అనుమతి లేకుండా ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేసి ఆర్డీఓల ద్వారా నివేదిక పంపాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీఓలు సూర్యనారాయణ, శ్రీనివాస్, వేణు మాధవ్, తాసీల్దార్లు పాల్గొన్నారు.



సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సూర్యాపేట కలెక్టరేట్ ముట్టడి

సూర్యాపేట, జూలై 27 : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరుతూ శనివారం విద్యార్థులతో కలిసి సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి నిధుల కేటాయింపు లేకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినా.. విద్యకు కనీసం 15శాతం నిధులు కూడా కేటాయించలేదని విమర్శించారు. విద్యారంగానికి చేసిన కేటాయింపులు సరిపోవని, తక్షణమే బడ్జెట్‌ను సవరించి కనీసం 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటని, వెంటనే మంత్రిని ఏర్పాటు చేయాలని అన్నారు. 1400 మంది విద్యార్థులు చదువుతున్న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరిపడా తరగతి గదులు లేవని తెలిపారు. అదనపు తరగతి గదులను నిర్మించాలని, ప్రతి గ్రామానికీ బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థుల ఉన్నత విద్యకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టరేట్‌లోకి పోవడానికి ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో పోలీసులు, విద్యార్థులకు మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. కలెక్టరేట్ కార్యాలయ అధికారి సుదర్శన్‌రెడ్డి విద్యార్థుల వద్దకు వచ్చి వినతి పత్రం తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్, నాయకులు అక్కెనపల్లి వినయ్, విష్ణు, తన్వేశ్, శ్రవణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# వణికిస్తున్న సీజనల్ వ్యాధులు



## డెంగీ, విషజ్వరాలతో మంచం పడుతున్న ప్రజలు

- దవాఖానలకు క్యూ కడుతున్న బాధితులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో లేని మందులు
- జిల్లాలో ఒక మలేరియా, 54 డెంగీ కేసుల నిర్ధారణ
- నాగార్జునసాగర్ ఆయకట్టులో మళ్లీ విజృంభిస్తున్న విషజ్వరాలు

నీలగిరి, జూలై 27 : వర్షాలు ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు జిల్లా ప్రజలను వణికిస్తున్నాయి. పల్లెలు, పట్టణం అనే తేడా లేకుండా అంతటా డెంగీ, విషజ్వరాలు ప్రబలుతున్నాయి. నల్లగొండ జిల్లా జనరల్ ఆసుపత్రికి రోజూ ఐదు వందల మంది వరకు జ్వర బాధితులు వస్తున్నట్లు దవాఖాన అధికారులు చెబుతున్నారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 9,574 మంది జ్వరాల బారిన పడ్డారని, అందులో ఒక మలేరియా, నాలుగు చికున్ గున్యా, 54 డెంగీ కేసులు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కానీ.. వాస్తవికంగా సుమారు 58,236 మంది జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. నాగార్జునసాగర్ ఆయకట్టుతోపాటు అన్ని మున్సిపాలిటీలు, మరికొన్ని మండలాల్లో విషజ్వరాలు అధికంగా ఉన్నట్లు తెలిసింది.

గ్రామ పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడంతో పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. దాంతో ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. ముఖ్యంగా మున్సిపాలిటీల్లోని స్లమ్ ఏరియాల్లో, నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంతాల్లో ప్రజలు జ్వరాల బారిన పడి ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. జ్వరం బారిన పడి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్తే మందు బిల్లలతోనే సరిపెడుతున్నారు. గ్యాస్, కడుపు నొప్పి, ఇతర మందులతోపాటు సెలైన్ బాటిల్స్ లేకపోవడంతో బయటికే రాస్తున్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల్లో సరిపడా మందులు అందుబాటులో లేకపోవడంతో పేదలు సైతం ప్రైవేటు దవాఖానలను ఆశ్రయించాల్సి వస్తుంది. మరికొందరు స్థానికంగా ఉండే ఆర్ఎంపీలు ఇచ్చిన మందులను వాడుతూ సరిపెట్టుకుంటున్నారు. గతంలో మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా, బోధకాలు తదితర వ్యాధుల బారిన పడి పలువురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రజలు సీజన్ వ్యాధులతో ఇబ్బందులకు గురవుతుంటే.. ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో ఓపీ చీటీ రాయించుకునేందుకు బారులుదీరిన జనం

### రోగులతో నిండిన జిల్లా ఆసుపత్రి

నల్లగొండ జిల్లా జనరల్ ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతున్నది. సీజనల్ వ్యాధులతోపాటు పలు రోగాలకు సంబంధించి పేషెంట్లు చికిత్స కోసం పెద్ద ఎత్తున ఆసుపత్రికి వస్తున్నారు. అయితే.. పేరుకే పెద్దాసుపత్రి అయినా రోగులకు కావాల్సిన కనీస సౌకర్యాలు ఉండటం లేదు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సరిపడా మంచాలు లేకపోవడంతో వార్డుల్లో, బాల్కనీల్లో నేలపైనే చికిత్స పొందుతున్నారు. రోజూ వందల సంఖ్యలో రోగులు వస్తుండడంతో వైద్య సిబ్బంది ఏం చేయాలో అర్థం కాని స్థితిలో ఉన్నారు.

### ప్రమాదకర పరిస్థితి ఉన్న మండలాల గుర్తింపు

జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదకర మండలాలను జిల్లా వైద్యారోగ్య శాఖ గుర్తించింది. మలేరియా, డెంగీతోపాటు విషజర్వాలు ప్రబలే ప్రాంతాలను ముందస్తుగా గుర్తించిన అధికారులు.. అక్కడ ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రజలను చైతన్యం చేస్తున్నారు. పెద్దవూర, డిండి, దామరచర్ల, హాలియా, త్రిపురారం, అడవి దేవులపల్లి, నల్లగొండ, నాగార్జునసాగర్‌తోపాటు చుట్టు పక్కల ప్రాంతాలు నిడమనూరు, తిరుమలగిరి, అడవిదేవులపల్లి, మర్రిగూడ, నకిరేకల్, కట్టంగూర్‌ను ప్రమాదకర మండలాలుగా గుర్తించారు.

### విజృంభిస్తున్న డెంగీ, మలేరియా

జిల్లాలో మలేరియా జ్వరాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. నాలుగేండ్లుగా నమోదు కాని మలేరియా పాజిటివ్ కేసులు ఈ సంవత్సరం నమోదవుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో ఒక కేసు నమోదైనట్లు రికార్డుల్లో ఉన్నా.. అనధికారంగా సుమారు 250 కేసులు వచ్చినట్లు తెలిసింది. అది కూడా నల్లగొండ జిల్లా కేంద్రంలోనే ఎక్కువ మొత్తంలో ప్రబలినట్లు సమాచారం. దీనికితోడు డెంగీ కూడా విజృంభిస్తుంది. ఇప్పటి వరకు ఈ సీజన్‌లో 90,091 మంది నుంచి రక్త నమునాలు సేకరించగా.. అందులో 54 డెంగీ, 4చికున్ గున్యా కేసులు నమోదయ్యాయి. 9,574 సాధారణ జ్వరాలు వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామంలో విషజ్వరాలు ప్రబలడంతో వైద్యారోగ్య శాఖ అధికారులు ఆ గ్రామంలో చాలా రోజులు క్యాంపులు పెట్టి సాధారణ స్థితికి తెచ్చారు. అదేవిధంగా యాదాద్రి థర్మల్ ప్లాంటులో కూడా విషజ్వరాలు ప్రబలాయి. సాగర్ ఆయకట్టు ప్రాంతంలోని చాలా గిరిజన తండాల్లో విషజ్వరాలు విజృంభించాయి. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మున్సిపాలిటీల్లో విషజ్వరాలు ప్రబలుతుండడంతో కలెక్టర్ ఇంటింటి సర్వేకు ఆదేశాలు ఇచ్చారు.

### పీహెచ్‌సీల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాం

సీజనల్ వ్యాధులకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులను అందుబాటులో ఉంచాం. ఇప్పటి వరకు జిల్లాలో ఒక మలేరియా కేసు మాత్రమే నమోదైంది. నాగార్జున సాగర్‌లోని ఆయకట్టు, నకరేకల్‌తోపాటు మరికొన్ని మండలాల్లో సాధారణ జ్వరాలు వచ్చినట్లు రిపోర్టులు వచ్చాయి. దీనిపై వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నాం. జిల్లా అంతటా ఇంటింటి జ్వర సర్వే నిర్వహిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాలతో మున్సిపాలిటీల్లో రెండోసారి జ్వర సర్వే నిర్వహిస్తూ జ్వర బాధితులను గుర్తించి మందులు అందిస్తున్నాం. మూడు రోజులు పర్యవేక్షణలో ఉంచి తగ్గకపోతే సమీపంలోని పీహెచ్‌సీ, యూహెచ్‌సీలకు పంపి వైద్యం అందిస్తున్నాం. జిల్లాలో ఎలాంటి సమస్యలూ లేవు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సీజనల్ వ్యాధులను అరికడుతున్నాం.

**- డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి**

### డెంగీతో హోంగార్డు మృతి



హోంగార్డు జానీ (ఫైల్)

మఠంపల్లి, జూలై 27 : మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు జానీ డెంగీతో శనివారం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హోంగార్డు జానీ ఆరు నెలల క్రితం చిలుకూరు పోలీస్ స్టేషన్ నుంచి మఠంపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయనకు 10రోజుల క్రితం తీవ్ర జ్వరం రావడంతో అస్వస్థతకు గురయ్యాడు. దాంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. జానీ మృతికి హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, మఠంపల్లి ఎస్ఐ రామాంజనేయులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. జానీ స్వస్థలం హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



దామరచర్ల మండలం నర్సాపురంలో జ్వరపీడితులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

# చిక్కుల్లో చేనేత

## ఉమ్మడి నల్లగొండలో మళ్లీ పాత రోజులు

- పడిపోయిన అమ్మకాలు.. పేరుకుపోతున్న వస్త్ర నిల్వలు
- నేతన్నను గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కారు
- బీఆర్ఎస్ పథకాలకు మంగళం.. మరికొన్ని పెండింగ్

యాదాద్రి భువనగిరి, జూలై 27 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో సర్కారు తోడ్పాటు లేక నేతన్నల పరిస్థితి దుర్భరంగా ఉండేది. పనిలేక, ఉపాధి కరువై.. తెచ్చిన అప్పులు, మిత్తీలు కట్టలేక అనేక మంది ఆత్మహత్యకు పాల్పడిన దుస్థితి. కానీ.. స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో నేతన్నలకు కష్టాలు మొదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ పట్టింపు లేమితో చేనేత పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుపోతున్నది.

చేనేత కార్మికులు సంప్రదాయ పద్ధతులను నమ్ముకొని మగ్గాలపై చీరెలు, చేనేత వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 20వేల మంది చేనేత కార్మికులు ఉంటారు. భూదాన్ పోచంపల్లి, గట్టుప్పల్, పుట్టపాక, సంస్థాన్ నారాయణపురం, భువనగిరి, కొయ్యలగూడెం, చండూరు, మునుగోడు తదితర ప్రాంతాల నుంచి చీరెలు అధికంగా ఉత్పత్తి చేస్తారు. అయితే.. పట్టు చీరెలు అంతంత మాత్రంగానే అమ్ముడుపోతుండటం, టెస్కో సరిగా కొనకపోవడంతో నేతలన్నకు ఇబ్బందులు తప్పడంలేదు. చేనేత కార్మికులు మాస్టర్ వీవర్స్ వద్ద కూలికి మగ్గాలు నేస్తుంటారు. వస్త్ర నిల్వలు పేరుకుపోవడంతో ఉత్పత్తికి ముందుకు రావడంలేదు. దీంతో షావుకార్లు నేతన్నలకు పెద్దగా పని ఇవ్వడంలేదు. కొందరు పని కల్పిస్తున్నా కూలి డబ్బులు మాత్రం ఆలస్యంగా ఇస్తున్నారు. దీంతో నేత కార్మికులకు పూట గడవడం కష్టంగా మారుతున్నది. మరోవైపు గిరాకీ లేకపోవడంతో రూ.10వేలకు అమ్ముకునే చీరెను రూ.7వేల నుంచి రూ.8వేలకు విక్రయిస్తున్నారు. చేనేత వస్త్రాలను ఎప్పటికప్పుడు కొనాల్సిన టెస్కో కనీసం పట్టించుకోవడంలేదు. వస్త్ర నిల్వలు రూ.కోట్లల్లో పేరుకుపోవడంతో గిరాకీ లేక కార్మికులకు పని దొరుకడంలేదు. ఇటీవల కొనుగోళ్లు ప్రారంభించినా ఒక్కో చీరెపై రూ.800 తక్కువగా కొంటున్నట్లు వీవర్లు చెబుతున్నారు. దీంతో ఒక్కో వార్పునకు ఐదారు వేల రూపాయల నష్టం వాటిల్లుతున్నది.

### ఇక్కత్ వస్త్రాలు కాపీ..

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి చేనేత టై అండ్ డై ఇక్కత్ పట్టు చీరెల డిజైన్లకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. పేటెంట్ హక్కు కలిగిన పోచంపల్లి చేనేత ఇక్కత్ పట్టు చీరెల డిజైన్లు కాపీకి గురవుతున్నాయి. పోచంపల్లి ఇక్కత్ డిజైన్లను కొందరు బడా వ్యాపారులు కాపీ కొట్టి.. పవర్ లూమ్‌లపై ప్రింటెడ్ పాలిస్టర్ చీరెలను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇవి మార్కెట్‌లో అతి తక్కువ ధరకే లభిస్తుండడంతో పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరెలకు మార్కెట్ తగ్గుతున్నది. చేనేతతోపాటు పవర్‌లూమ్స్ కూడా దీనస్థితికి చేరుకుంది. ముడి సరుకుల ధరలు పెరిగిపోతున్నాయి. ఇక్కడ తయారయ్యే పట్టు వస్త్రాలతోపాటు పంచెలు, టవల్స్, లుంగీలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో పనిలేక ఉమ్మడి జిల్లాలో ఆలేరు, పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట, మోత్కూరు, నల్లగొండ, నకిరేకల్ తదితర మండలాల్లో ఉన్న పవర్‌లూమ్ పరిశ్రమలు మూతబడే పరిస్థితికి చేరుకున్నాయి.

### పోచంపల్లికి ఐఐహెచ్‌టీ కలేనా!

భూదాన్ పోచంపల్లిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ఏర్పాటు కలగానే మారుతున్నది. ఎన్నో వినతులు, విజ్ఞప్తుల తర్వాత తాజాగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఐఐహెచ్‌టీ మంజూరు చేసింది. ఇన్‌స్టిట్యూట్ ఎక్కడ ఏర్పాటు చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. పోచంపల్లి మండలం కనుముక్కల గ్రామ పరిధిలో ఉన్న హ్యాండ్లూమ్ పార్క్‌లో భవనాలు అందుబాటులో ఉన్నాయి. ఇది 23 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఐఐహెచ్‌టీ ఏర్పాటైతే అనేక విధాలుగా మేలు జరుగుతుంది. పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఐఐహెచ్‌టీ రాకపోగా, ఇక్కడే ఉన్న హ్యాండ్లూమ్ పార్కును కూడా తెరువడంలేదు.



### చేనేత మిత్రకు సాయం బంద్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేత కార్మికులకు సంబంధించిన పథకాలకు ఒక్కొక్కటిగా పాతర వేస్తున్నది. నేతన్నల కోసం బీఆర్ఎస్ సర్కారు తీసుకొచ్చిన చేనేత మిత్ర పథకానికి మంగళం పాడింది. నేత కుటుంబానికి నెలకు రూ.3వేలు చెల్లించకుండా అటకెక్కించింది. గతంలో చేనేత మిత్ర పథకం కింద ప్రభుత్వం నూలు, రసాయనాలు, ముడి సరుకులకు సబ్సిడీ ఇచ్చేది. నూలు, సిల్క్, ఉన్ని, డై, రసాయనాల కొనుగోలుపై 40శాతం సబ్సిడీ కల్పించేది. అయితే సబ్సిడీ పొందడం నేతన్నలకు ఇబ్బందిగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన నేతన్నలకు నెలకు రూ.30వేల సాయం అందించాలని నిర్ణయించింది. కార్మికుల కుటుంబాలకే నేరుగా డబ్బులు జమ చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క పైసా కూడా చెల్లించలేదు. పథకాన్ని బంద్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

### 'త్రిఫ్ట్' చెల్లింపులు పెండింగ్

నేతన్నలకు సామాజిక భద్రత కల్పించడం కోసం కేసీఆర్ సర్కారు చేనేత చేయూత పథకాన్ని తీసుకొచ్చింది. నేత కార్మికుల నెలసరి చేనేత ఆదాయంలో ఎనిమిది శాతం ఆర్డీ1లో జమ చేసిన తర్వాత.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీ2లో 15శాతాన్ని నేరుగా జమ చేయాలి. ఆ మొత్తం నగదు వడ్డీతో సహా మూడేండ్ల తర్వాత కార్మికులకు అందుతుంది. ప్రస్తుత 2021-2024 సంవత్సరానికి గాను యాదాద్రి జిల్లాలో 11వేల మంది కార్మికులు నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక డబ్బులు జమ చేయడమే మరిచిపోయింది. సెప్టెంబర్ నుంచి 11 నెలలుగా డబ్బులు చెల్లించకపోవడంతో సుమారు రూ.25 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. కార్మికులు మాత్రం తమ వాటాను ఠంఛనుగా కడుతున్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం చేనేత రంగాన్ని ఆదుకోకపోగా.. జీఎస్టీ పన్నుల మోతతో నేతన్నల నడ్డి విరుస్తున్నది. కేంద్రం నూలుపై 12శాతం, రసాయనాలపై 18 శాతం జీఎస్టీ విధిస్తుండటంతో డబ్బులు ఎక్కువ పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తున్నది. ఈ క్రమంలో నేత కార్మికులకు పని దొరక్కపోవడంతో మళ్లీ వలసబాట పడుతున్నారు.

## విద్యార్థులు పరిశోధనల్లో రాణించాలి

- బయోటెక్నాలజీ గ్రాడ్యుయేషన్ డేలో ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి



బయోటెక్నాలజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డేలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి

రామగిరి, జూలై 27 : నేటి సమాజంలో బయోటెక్నాలజీ రంగానికి ఎంతో ఆదరణ ఉన్నదని, వర్సిటీలో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులంతా నూతన పరిశోధనల్లో రాణించాలని ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి అన్నారు. వర్సిటీ సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ కళాశాలలోని సెమినార్ హాల్‌లో 2022-24 విద్యా సంవత్సరంలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేసిన విద్యార్థులకు శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులను అభినందించి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బయోటెక్నాలజీ రంగం ఆవశ్యకత, ఆ రంగంలో వస్తున్న నూతన మెడిసిన్స్, ఇతర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, ప్లేస్‌మెంట్ అధికారి వై.ప్రశాంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శివరాం, మాధురి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


